జిల్.. జిగేల్



ఇది కదా అభివృద్ధి

నాడు అంధకారం

గతంలో బర్మా క్యాంప్, ఇందిరానగర్–1 నుంచి 5, జైభారత్‌నగర్, శివలింగపురం, శ్రీనివాసనగర్, శివనగర్, జవహర్‌లాల్ నగర్, బాపూజీనగర్ తదితర కొండవాలు ప్రాంతాల్లో అంధకార పరిస్థితి ఉండేది. నాడు వీధిలైట్లు సక్రమంగా వెలగక పోవడం, విద్యుత్ స్తంభాలు శిథిలమవడం, కరెంట్ తీగలు ప్రమాదకరంగా మారడం వంటి సమస్యలు వేధించేవి.

నేడు కాంతివంతం

ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ సమస్యలను సభ్యులు లేవనెత్తడంతో ఏపీఈపీడీసీఎల్, జీవీఎంసీ విద్యుత్ విభాగ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. దీంతో ఆయా కొండవాలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ లైట్ల వెలుగులు విరజిమ్ముతున్నాయి.

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు ప్రాంతాలు విద్యుద్దీపాల కాంతులతో మెరిసిపోతున్నాయి. కంచరపాలెం, బర్మాక్యాంప్, ఊర్వశి కూడలి పరిధిలో కాలనీల్లో సుమారు 220 కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేశారు. అవి పూర్తిస్థాయిలో వెలిగేలా జీవీఎంసీ చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ సత్ఫలితాలిస్తోంది. విద్యుత్ సిబ్బంది ప్రతి రోజూ పర్యవేక్షిస్తున్నారు. కొండవాలు ప్రాంతాల్లో దాదాపు 92 శాతం వీధిలైట్లు సక్రమంగా వెలుగుతున్నాయి. ఊర్వశి కూడలి నుంచి కంచరపాలెం కొండవాలు ప్రాంతాల్లోని రహదారులు, మెట్ల మార్గాలు విద్యుత్ కాంతుల్లో సుందరంగా కనిపిస్తున్నాయి.

- విద్యుత్ కాంతులీనుతున్న కొండవాలు ప్రాంతాలు
- కొత్త స్తంభాలు, లైట్ల ఏర్పాటు
- 92 శాతం వెలుగుతున్న వీధి దీపాలు
- వెలగని చోట యుద్ధప్రాతిపదికన చర్యలు

అధికారుల చర్యలు.. నిధులు

కొండవాలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకూడదనే ఉద్దేశంతో ఏపీఈపీడీసీఎల్ జోన్–2, జీవీఎంసీ విద్యుత్ లైట్ల అధికారులు సంయుక్తంగా తగు చర్యలు చేపట్టారు.

- జైభారత్‌నగర్, ఇందిరానగర్–1 ప్రాంతాల్లో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.
- ప్రధాన రహదారుల్లో సుమారు రూ.1.3 లక్షలతో 7 రౌండ్ పోల్స్, వాటికి విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు.
- బర్మాక్యాంప్, శ్రీనివాసనగర్, శివనగర్ ప్రాంతాల్లో మరో రెండు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి.
- రింగ్ లైట్ల స్తంభాలకు మరమ్మతులు చేపట్టారు.
- హెచ్‌డీ, కేపీ విద్యుత్ తీగలు తొలగించి, కొత్త వైర్లు ఏర్పాటు చేశారు.
- సుమారు రూ.7 లక్షల జీవీఎంసీ నిధులతో 40 వాట్ల విద్యుత్ లైట్లు 130, 70 వాట్ల లైట్లు 90 అమర్చారు.
- ఆయా ప్రాంతాల్లో సుమారు 35 వీధిలైట్లను మానటరింగ్ చేసే బాక్స్‌లను పునరుద్ధరించారు.

కొండవాలు నివాసుల హర్షం

ఏపీఈపీడీసీఎల్ జోన్–2 కంచరపాలెం అధికారులు, జీవీఎంసీ విద్యుత్ లైట్ల విభాగం అధికారుల సంయుక్త చొరవతో బర్మాక్యాంప్, ఇందిరానగర్–1 నుంచి 5, జైభారత్‌నగర్, శివలింగపురం, శ్రీనివాసనగర్, జవహర్‌లాల్ నగర్, బాపూజీనగర్, జయప్రకాశ్‌నగర్, సురేష్‌రామ్‌నగర్ ప్రాంతాల్లో సుమారు 220 ఎల్‌ఈడీ లైట్లు, 20 కొత్త సిమెంటు స్తంభాలు ఏర్పాటు చేశారు. ఊర్వశి కూడలి జాతీయ రహదారి నుంచి బర్మాక్యాంప్ కొండవాలు ప్రధాన రహదారుల్లో విద్యుత్ షో రింగ్ లైట్లు జీవీఎంసీ విద్యుత్ విభాగ సిబ్బంది అమర్చారు. వీధిలైట్లు సక్రమంగా వెలుగుతుండటంతో కొండవాలు ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కంచరపాలెంలోని ఇందిరానగర్ కొండవాలు ప్రాంతంలో విద్యుద్దీప వెలుగులు



శ్రీనివాసనగర్‌లో విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటు



బాపూజీనగర్‌లో కొత్త ఎల్‌ఈడీ లైట్లు అమర్చుతున్న సిబ్బంది



జైభారత్‌నగర్‌లో స్తంభానికి కొత్త వైర్లు అమర్చుతున్న సిబ్బంది

చీకటి నుంచి విముక్తి



మా ప్రాంతంలో విద్యుత్ లైట్లు లేక ఇబ్బంది పడేవాళ్లం. అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతో ఆ బాధలు తప్పాయి. వీధిలైట్ల ఏర్పాటుతో రహదారుల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయి.

– కిషోర్, ఇందిరానగర్

మెట్ల మార్గాల్లో వెలుగులు



గతంలో మా కొండవాలు ప్రాంతాల్లో రాత్రి వేళ నడిచి వెళ్లాలంటేనే భయాందోళనలుగా ఉండేది. నేడు ప్రతి వీధిలో లైట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీధుల మెట్ల మార్గాలన్నీ విద్యుద్దీప కాంతులతో కనిపిస్తున్నాయి.

– రమణమ్మ, బాపూజీనగర్

అధికారుల చర్యలు భేష్



కొండవాలు ప్రాంతాల్లో తుప్పుపట్టి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు, తీగలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు. హైమాస్ట్ లైట్లతో చీకట్లు తొలగిపోయాయి. అధికారులు చేపట్టి చర్యలు బాగున్నాయి.

– అప్పారావు, ఇందిరానగర్–5

క్లుప్తంగా

శరవేగంగా తహసీల్దార్ కార్యాలయ అభివృద్ధి పనులు



పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే టైల్స్ వర్క్ పూర్తి చేశారు. శనివారం నిర్వహించిన కార్యాలయ ముందు భాగం ఎలివేషన్ పనులను తహసీల్దార్ ఆనంద్‌కుమార్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయ అభివృద్ధి కోసం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున రూ.5 లక్షల నిధులను అందజేశారన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఓటు వేయడంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కలెక్టర్ అఖిల

సీతమ్మధార: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని డిప్యూటీ కలెక్టర్, ఉత్తర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.అఖిల సూచించారు. సీతమ్మధార రైతుబజార్‌లో శనివారం ఓటు హక్కు వినియోగంపై ఈవీఎంల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎంలో ఓటు హక్కు ఎలా ఉపయోగించుకోవాలో రైతులకు పలు సూచనలిచ్చారు. జాగ్రత్తగా ఓటు వేయాలని, పొరపాటున రెండు సార్లు బటన్ నొక్కితే ఓటు చెల్లదని చెప్పారు. ప్రతి ఒక్కరూ పిల్లలను చదివించాలని సూచించారు. కార్యక్రమంలో సీతమ్మధార తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్, ఆర్‌ఐ ఇబ్రహీం, వీఆర్వోలు పొన్నాడ నాగేశ్వరరావు, మూర్తి, రైతుబజార్ ఈవో కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే న్యూకాలనీలో అన్నదానం



అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ లీలావతి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ ఉమా నీలకంఠేశ్వరాలయం వద్ద కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ ప్రారంభించారు. ముందుగా ఆలయంలో లీలావతి, శ్రీనివాస్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాస్, మొల్లేటి గణేష్, కుమార్, శంకర్, జగన్, నాగరాజు, జయరాం, శేకర్, చిన్నమ్ములు, ఆశా, తిరుపతి, గోపి, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతి

మద్రిపాలెం: చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కప్పరాడ సురేష్ రామ్‌నగర్‌లో నివసిస్తున్న అన్ను సత్యం(64) అనే వృద్ధుడు ఈ నెల 3న ఇంట్లో మంచం మీద నుంచి కిందకు పడిపోయారు. కుటుంబ సభ్యులు అతడిని కేజీహెచ్‌కు తరలించి చికిత్స చేయించారు. శనివారం ఉదయం చికిత్స పొందుతూ ఆ వృద్ధుడు మృతిచెందాడు. మూడు నెలల కిందట అతడి భార్య మరణించింది. అప్పటి నుంచి మనస్తాపం చెందారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో కూడా ఇలాగే పడిపోగా చికిత్స అందించారు. మృతుడి కుమారుడు అన్ను సురేష్ ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ నరసింహం కేసు దర్యాప్తు చేపట్టారు.

మన రాజ్యాంగం ప్రపంచానికి మార్గదర్శకం



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

సీతమ్మధార: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు మార్గదర్శకమని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. బుల్లయ్య కళాశాల రోడ్డులోని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ 40 వసంతాల(రూబీ జూబ్లీ) వేడుకల్లో భాగంగా శనివారం అంబేడ్కర్ భవన్‌లో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి మారుమూల గ్రామం నుంచి ప్రపంచ స్థాయి మేధావిగా ఎదిగిన అంబేడ్కర్ జీవితం నేటితరానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత పక్షపాతి అని, ఎస్సీ, ఎస్టీలపై ఎంతో ఆదరణ చూపిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అంబేడ్కర్ భవన్ అభివృద్ధికి ఎంపీ కోటా నుంచి రూ.25 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. అవసరమైన మేరకు నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా దళితుల స్థితిగతుల్లో మార్పు రాలేదన్నారు. రాజ్యాంగ హక్కులు పొందేందుకు అందరూ సమష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణ్‌రావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్, డాక్టర్ అర్జున్, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకటరావు, మైనార్టీ సంఘం నాయకులు ఐఎం అహ్మద్, డాక్టర్ మాటూరి శ్రీనివాస్, ఆర్పీఐ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ పోస్టర్ ఆవిష్కరణ



క్రీడా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల పోస్టర్‌ను శనివారం మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెటి శ్రీనివాసరావు సీతమ్మధారలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఇచ్చే కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడానికి అడుదాం ఆంధ్రా అనే కొత్త కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. తొలిసారిగా గ్రామ, వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ నెల 15 నుంచి 2024 ఫిబ్రవరి 3 వరకు 50 రోజుల పాటు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ ఇలా ఐదు రకాలైన క్రీడా పోటీలను నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తారని చెప్పారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారన్నారు. 15 ఏళ్లు నిండిన ఆసక్తి గల క్రీడాకారులందరూ పాల్గొనాలని కోరారు. ఈ నెల 15న మధురవాడ చంద్రంపాలెం హైస్కూల్‌లో ఉదయం 9.30 గంటలకు, చిట్టివలస బంతాట మైదానంలో ఉదయం 11.30 గంటలకు, భీమిలి మండలం తాళ్లవలస హైస్కూల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు, 16న ఆనందపురం హైస్కూల్‌లో ఉదయం 10 గంటలకు, పద్మనాభం మండలం రేవిడి హైస్కూల్‌లో ఉదయం 11 గంటలకు పోటీల ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు.

ఘోషాస్పత్రిలో వైద్య సేవలపై ఆరా



వైద్యులతో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం

మహారాణిపేట: వన్‌టౌన్‌లోని ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి(ఘోషాస్పత్రి)ని శనివారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సందర్శించారు. హైరిస్క్ పిల్లలు వార్డు, ఇతర వార్డులను పరిశీలించారు. వైద్యులు అందిస్తున్న సేవలపై బాలింతలు నుంచి వివరాలు సేకరించారు. బరువు తక్కువతో పుట్టిన పిల్లలపై ఎటువంటి వైద్య చికిత్సలు అందిస్తున్నారో వైద్యులను అడిగి తెలుసుకున్నారు. లింగ నిర్ధారణ గోప్యత విషయంలో అమలు చేస్తున్న విధి విధానాలపై ఆరా తీశారు. సెక్యూరిటీ విధానాన్ని పరిశీలించారు. అలాగే జనన ధ్రువీకరణ పత్రాలు అందించే కార్యాలయాన్ని సందర్శించి.. పత్రాల్లో తప్పులు దొర్లితే చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తోందన్నారు. బాలల హక్కుల పరిరక్షణలో ఉల్లంఘనలు జరిగితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. రాష్ట్రంలోని పలు పిల్లల ఆస్పత్రులపై ప్రభుత్వానికి పలు సిఫార్సులు చేయనున్నట్లు తెలిపారు. సీడబ్ల్యూసీ చైరపర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ, ఆస్పత్రి ఆర్‌ఎంవోలు డాక్టర్ రాధారాణి, డాక్టర్ మెహర్, వైద్యులు గీతావందన, ఉప్పాడ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



లైఫ్‌గార్డ్స్ కాపాడిన యువకుడు (సర్కిల్)

కొమ్మాది: రుషికొండ బీచ్ వద్ద సముద్రంలో కొట్టు కుపోతున్న యువకుడిని లైఫ్‌గార్డ్స్ కాపాడా రు. వివరాలివీ.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన నలుగురు యువకులు శనివారం సాయంత్రం రుషికొండ బీచ్ కు చేరుకున్నారు. కాసేపు స్నేహితులందరూ సరదాగా గడిపి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వీరిలో గౌరవ్ యాదవ్ కొట్టుకుని పోతుండగా.. అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ చందు, సూరాడ నూకరాజు, చిన్నప్పన్న గమనించారు. వెంటనే రంగంలోకి దిగి యువకుడిని సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. మెరైన్ పోలీసులు యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

జలవనరుల పరిరక్షణపై జాతీయ సదస్సు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 11, 12 తేదీల్లో జలవనరుల పరిరక్షణ వ్యూహాలు–సుస్థిరత అనే అంశంపై జువాలజీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. శనివారం కళాశాల సెమినార్ హాల్లో సదస్సు పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఆక్వా కల్చర్ సాంకేతికతలో కొనసాగుతున్న పురోగతి, పెట్టుబడి అవకాశాలు, ఆక్వా కల్చర్‌లో సహకార రంగాలను గుర్తించడం ఈ సదస్సు లక్ష్యమని కన్వీనర్ డాక్టర్ హరిణి తెలిపారు. సదస్సులో పాల్గొనే ఔత్సాహికులు 93939 17880 నంబర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. డాక్టర్ పి.కె.జయలక్ష్మి, స్నేహ, రోజిన జార్జ్, భాస్కర సుధ, అరుణాదేవి పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



శ్రీనివాసనగర్‌లో శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 43వ వార్డు 252 సచివాలయం పరిధి శ్రీనివాసనగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి శనివారం కార్పొరేటర్ పి.ఉషశ్రీ శంకుస్థాపనచేసారు. సుమారు రూ.20 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులతో ఈ పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాప్టిస్ట్ చర్చి వజ్రోత్సవాలు

బీచ్‌రోడ్డు : అల్లిపురంలోని బాప్టిస్ట్ చర్చికి ఈ నెల 12వ తేదీతో 75 ఏళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా ఆదివారం నుంచి వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చర్చి చైర్మన్ పీవీ ప్రసాద్ తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం బీచ్ రోడ్డులోని వైఎంసీఏలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1948లో ఏర్పాటు చేసిన ఈ చర్చికి ప్రస్తుతం 5 వేల మంది సభ్యులున్నారన్నారు. వజ్రోత్సవ ప్రారంభోత్సవానికి ఎఫ్‌ఈబీఏ నేషనల్ డైరెక్టర్ సీఏ బెంజిమెన్, జాతీయ సెక్రటరీ ఎ. జెన్ని క్రిస్టఫర్ హాజరు కానున్నారన్నారు. మహిళలు, చిన్నారులకు అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైల్వే జోన్ ప్రక్రియ వేగవంతం చేయాలి



రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ చాంబర్స్ ప్రతినిధులు

దొండపర్తి: విశాఖలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయనను శనివారం వారు కలిసి పలు అంశాలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో రైలు నెట్‌వర్క్ అభివృద్ధికి, రైలు కనెక్టివిటీని మెరుగుపరచడానికి ఈ కొత్త జోన్ కీలకమైందని పేర్కొన్నారు. రాష్ట్రం మొత్తాన్ని కవర్ చేయడం, విశాఖ, గంగవరం, కాకినాడ, కృష్ణపట్నం వంటి ప్రధాన ఓడరేవులకు సేవలు అందించే అవకాశం ఉండడంతో దక్షిణ కోస్తా రైల్వే జోన్ సుమారు రూ.13 వేల కోట్ల ఆదాయార్జనతో భవిష్యత్తులో అత్యంత లాభదాయకమైన జోన్‌గా అవతరించే అవకాశం ఉందని తెలిపారు. కొన్నేళ్ల క్రితమే జోన్‌ను మంజూరు చేసినప్పటికీ.. ఇప్పటి వరకు ఆ ప్రక్రియను ప్రారంభించలేదని గుర్తు చేశారు. రైలు ద్వారా తక్కువ దూరంలో కార్గో తరలింపును ప్రోత్సహించేందుకు 50 శాతం సబ్సిడీ కల్పించాలని కోరారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో ముగిసిన పవిత్రోత్సవాలు



స్వామికి హారతి సమర్పిస్తున్న అర్చకులు



పూజల్లో పాల్గొన్న ఆలయ ఈవో ప్రసాద్, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఉదయం స్వామికి సంప్రదాయ బద్ధంగా సుప్రభాత సేవ నిర్వహించారు. 5.30 గంటలకు భక్తులు, అర్చకులు మేళతాళాల మధ్య ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. సన్నిధిగొల్ల సేవ అనంతరం స్వామికి సుప్రభాత సేవ చేశారు. ఉదయం 9 గంటలకు స్నపన కార్యక్రమం, అనంతరం పూర్ణాహుతి సమర్పణలో భాగంగా పవిత్రాలతో ఆలయ ప్రదక్షిణ చేసి హోమగుండంలో పూర్ణాహుతి సమర్పించారు. ఉత్సవ మూర్తులకు ఆలయ మండపంలో ప్రత్యేక ద్రవ్యాలతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. అనంతరం ఆలయ శిఖర కలశానికి అభిషేకం చేసి పవిత్రాలతో అలంకరించి అర్చకులు శేషాచార్యులు, వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షించారు. సాయంత్రం స్వామికి అలంకరించిన పవిత్రాలను తొలగించి భక్తులకు, దాతలకు పంపిణీ చేశారు. అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపు ఉత్సవం



గౌరీపరమేశ్వరుల అనుపు ఉత్సవంలో పాల్గొన్న మహిళలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని శ్రీ లలితా మహిళా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న గౌరీపరమేశ్వరుల మహోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. కేంద్ర గౌరీ సేవా సంఘంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తిరువీధిలో ఊరేగించి అనుపు చేశారు. కార్యక్రమంలో సూరిశెట్టి అప్పలకొండ, సూరిశెట్టి అచ్చుతరామ్, కాండ్రేగుల నాగరాజు, శరకం రాజు, శరకం సూరిబాబు, కండ్రపు బ్రహ్మాజీ, రెడ్డి వెంకటరమణ, కట్ట రాము, లలితా గ్రూప్, బుల్లెట్ బాయ్స్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విధిగా హెల్మెట్ ధారణ



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార: ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ద్వారకా పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు సూచించారు. గురుద్వారా జంక్షన్‌లో శనివారం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించకుండా రాకపోకలు సాగిస్తున్నారన్నారు. దీని వల్ల రోడ్డు ప్రమాదాలకు గురై ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. అతి వేగంగా డ్రైవ్ చేయడం ప్రమాదకరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు మీరిన పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ పరిశుభ్రతకు ప్రాధాన్యం



హార్బర్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ–2 ఆనందరెడ్డి

మురళీనగర్: పోలీస్ స్టేషన్ పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని విశాఖపట్నం డీసీపీ–2(ఎల్‌వో) కె.ఆనందరెడ్డి సూచించారు. నగరంలోని హార్బర్ స్టేషన్‌ను ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోర్టు ఏరియాతోపాటు స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్‌పై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. విధుల నిర్వహణలో ఎటువంటి అధికార దుర్వినియోగానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.